అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని మానవ హారం చేపట్టారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు, ఉపాధ్యాయులు వివరించారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూన్ 26

## డ్రగ్స్ వద్దు.. భవిష్యత్ ముద్దు



ఆమనగల్లు : కడ్తాల్‌లో మానవహారంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

# మత్తుకు యువత బానిస కావొద్దు

» అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అధికారులు

రంగారెడ్డి అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మత్తుకు యువత బానిస కావొద్దని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని సమావేశాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకున్న చర్యలపై చర్చించారు. ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాలు తీసుకుంటే కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. మత్తు పదార్థాల వాడకం సమాజానికి ప్రమాదకరమని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు మాదక ద్రవ్యాల వినియోగం కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. తెలిసీ తెలియక మత్తు పదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి నరసింహ రావు, బీసీ సంక్షేమాధికారి కేషురామ్, గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరి దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వల, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీలత

## ఉపాధి పనుల్లో నిబంధనలు అతిక్రమించొద్దు

» జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పీడీ శ్రీలత

మంచాల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు ఉపాధిహామీ పనులు చేపట్టాలని, వాటిని ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత హెచ్చరించారు. మంచాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండల పరిధిలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం 15 రోజులుగా క్షేత్ర పరిశీలన జరిపారు. మొత్తం రూ.7.72 కోట్ల పనులు చేపట్టగా, సుమారు 6వేల మందికి 2.26 లక్షల పనిదినాలు కల్పించారు. ఈ పనుల్లో రూ.3.19 కోట్లతో వరదనీటి మళ్లింపు, ఇంకుడు గుంతలు, కోళ్లషెడ్లు, నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకం పనులు చేశారు. రూ.3 కోట్లతో అటవీశాఖ ఆధ్వర్యంలో ఫారెస్టు భూముల్లో వరదనీటి నిల్వ, వనసంరక్షణ మొక్కల పెంపకం కోసం వెచ్చించారు. ఇంకా పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు, పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో పీడీ మాట్లాడుతూ ఎంక్వయిరీ రిపోర్టుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సుభాషిని, ఏపీడీ చరణ్‌గౌతమ్, అంబుడ్స్‌మెన్ సునిత, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఎంపీడీవో బాలశంకర్, ఎస్‌టీఎం అంజన్‌గౌడ్, ఎస్ఆర్‌పీ ఎం.నర్సయ్య, ఏపీవో వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న నాయకులు

## గోల్కొండ తొలి బోనం.. ఎమ్మెల్యే పూజలు

చేవెళ్ల/ షాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బోనాల సందడి మొదలైంది. మొదటి రోజు గురువారం నగరంలో గోల్కొండలోని జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను కుమ్మరి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మర్పల్లి మాలతీకృష్ణారెడ్డి, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతంకుమార్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, కుమ్మరి సంఘం నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం!

అందుబాటులో ఉండని పశువైద్య సిబ్బంది





మూతబడిన చెన్‌వెల్లి పశువైద్య ఉప కేంద్రం

జిల్లాలో పశు వైద్య సిబ్బంది తీరు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. విధులకు రావడం.. పోవడం అంతా తమ ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పశు వైద్యులు బదిలీలు లేకుండా ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వర్తిస్తుండటంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పశు కేంద్రాలకు రాకుండా సంపాదనే ధ్యేయంగా ప్రైవేటుగా ఆస్పత్రులను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తప్పుడు లెక్కలు చూపుతూ దురుసుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పశు కేంద్రాల్లో వైద్యం అందక జీవాలు మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## విధులకు ఎగనామం, సొంతంగా ఆస్పత్రుల నిర్వహణ

- టీకాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు దొంగ లెక్కలు
- వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత
- పశువైద్యులు ఏళ్ల తరబడి ఒకేచోట విధులు
- ఆర్‌జేడీ వరుస తనిఖీలతో పశువైద్యుల బేజార్
- ఈ అధికారి మాకొద్దంటూ రాష్ట్ర డైరెక్టర్‌కు విన్నపం
- నిజాయితీగా పనిచేసిన జిల్లా అధికారిపై బదిలీ వేటు



సీజ్ చేసిన గాలికుంటు నివారణ టీకా బాటిళ్లు

జిల్లాలో పశుసంపద వివరాలు

| | |
|---|---|
| కోళ్లు | 2,40,69,700 |
| గేదెలు | 1,67,000 |
| మేకలు | 1,68,126 |
| గొర్రెలు | 2,56,632 |
| పందులు | 6,076 |
| గుర్రాలు | 1535 |
| గాడిదలు | 160 |
| కుక్కలు | 28,500 |
| కుందేళ్లు | 3,034 |
| పాలు (లీటర్లు) | 7,40,482 |
| మాంసం (కేజీలు) | 1,49,986 |

రంగారెడ్డి అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వెటర్నరీ శాఖలో వైద్య సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా మారింది. కేంద్రాల్లో సమయానికి ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. ఉన్న అరకొర పశువైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించటం లేదు. దీంతో వైద్యం అందక మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేయడం, బదిలీలు లేకపోవడంతో ఉద్యోగుల పనితీరు అధ్వానంగా మారింది. వెటర్నరీ డాక్టర్లు బయట ప్రైవేట్ ఆస్పత్రులు నడిపిస్తూ డబ్బు సంపాదించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ పశు వైద్య కేంద్రాల్లో మిగతా 8వ పేజీలో...

## కొత్త భవనాలు, మరమ్మతులు

జిల్లాలోని దోస్వాడ, సరూర్‌నగర్, మాదాపూర్, హైదర్‌గూడ, చౌదరిగూడలో కొత్త పశువైద్యశాల భవనాలు నిర్మించాల్సి ఉందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా నందిగామ, మహరాజ్‌పేట్, మొగిలిగిద్ద గ్రామాలలో ఉన్న పశువైద్యశాలలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చిన్నతూండ్ల, తాటిపర్తి, వెంకటాపూర్, చిల్‌కూర్, అజీజ్‌నగర్, కేతిరెడ్డిపల్లి, రాయపోల్, ముద్విన్, మీర్‌ఖాన్‌పేట్, తాళ్లపల్లి, చౌదర్‌పల్లి, కొండాపూర్‌లలో ఉన్న సబ్‌సెంటర్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇవి కాకుండా నాదర్‌గుల్, పెద్దమంగళారం, వెల్‌జాల్, పడకల్, నిర్దవెల్లి, నేదునూర్, పులిమామిడి. పెద్దఅంబర్‌పేటలలో కొత్తగా సబ్‌సెంటర్లు నిర్మించాల్సి ఉంది. ఇవి నిర్మిస్తే మారుమూల గ్రామాలలోని పశువులకు మెరుగైన సేవలందనున్నాయి.

### సిబ్బంది కొరత

జిల్లాలోని పశువులకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. 11 ఏళ్లుగా ఖాళీ పోస్టులు దర్శనమిస్తున్నాయి. దీంతో కొన్ని చోట్ల సబ్‌సెంటర్లు మూత పడ్డాయి. జిల్లాలో సుమారు 12 వెటర్నరీ సబ్‌సెంటర్లు మరమ్మతుకు నోచుకోవడం లేదు.

### మూగ రోదన

వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలి మృతి చెందుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. పశువైద్యశాలల్లో సిబ్బందితో పాటు మందుల కొరత, ఆధునిక పరికరాలు లేకపోవడంతో మూగజీవాల పోషకులు ప్రైవేట్‌బాట పడుతున్నారు.

### మూతబడిన కేంద్రాలు

పశు వైద్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది లేకపోవడంతో వైద్య కేంద్రాలు ఒక్కొక్కటిగా మూత పడుతున్నాయి. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల, కమ్మెట, ఖానాపూర్, చెన్‌వెల్లి, గుండాల, ముడిమ్యాల గ్రామాల్లో పశు వైద్య కేంద్రాలు మూత పడ్డాయి. ఏడేళ్లుగా ఈ పశువైద్య కేంద్రాల్లో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

### డివిజన్ ఎత్తేశారు..!

చేవెళ్లలో పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయం ఉండేది. తెలంగాణ ఏర్పడిన కొన్నాళ్లకే డివిజన్స్ ఎత్తేయడంతో చేవెళ్లలోని ఏడీ కార్యాలయాన్ని వికారాబాద్‌కు తరలించారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలన్నీ నిరుపయోగంగా మారాయి. దీంతో ఎస్డీవో కార్యాలయానికి పక్కా భవనం లేకపోవడంతో పశువైద్య భవనంలోకి షిఫ్ట్ చేశారు. చేవెళ్ల పార్లమెంట్ హెడ్‌క్వాటర్‌లో ఉండాల్సిన ఏడీ కార్యాలయం ఇతర ప్రాంతానికి తరలించినా పాలకులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఆసుపత్రుల వివరాలు

| | |
|---|---|
| ప్రాంత పశువైద్యశాలలు | 04 |
| పశువైద్య కేంద్రాలు | 46 |
| గ్రామీణ పశు వైద్య కేంద్రాలు(సబ్‌సెంటర్లు) | 87 |
| గోపాల మిత్రలు | 32 |
| డిపార్ట్‌మెంటల్ ఇనిస్టిట్యూషన్స్ | 118 |

# ఎన్నాళ్లీ కష్టాలు?

## రేకుల షెడ్డులో ఆమనగల్లు ఉన్నత పాఠశాల



శిథిలావస్థలో బస్టాండ్ పాఠశాల భవనం

అసౌకర్యాల నడుమ విద్యార్థుల ఇబ్బందులు

శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనం

ప్రతిపాదనల్లోనే సొంత భవన నిర్మాణం

చొరవ చూపని ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆమనగల్లు జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ (బస్టాండ్) ఉన్నత పాఠశాల దయనీయంగా తయారైంది. ఏళ్ల కాలంగా అసౌకర్యాల నడుమ కొనసాగుతుంది. కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎందరో మేధావులనందించిన ఈ పాఠశాలలో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ మూతబడే స్థితికి చేరుకుంటుంది. పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని రెండు దశాబ్దాలుగా స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా స్పందన లేదు. భవన నిర్మాణం నేతల హామీలు, ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది ఉన్నత స్థానాలలో ఉన్నా, స్థానికంగా వివిధ పార్టీల నేతలుగా కొనసాగుతున్నా భవన నిర్మాణం మిగతా 8వ పేజీలో...

### ప్రభుత్వానికి నివేదించాం



ఆమనగల్లు బస్టాండ్ ఉన్నత పాఠశాలకు సొంత భవన నిర్మాణం గురించి ప్రభుత్వానికి నివేదించాం. ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాం. పాత భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం దుస్థితి గురించి మున్సిపాలిటీ అధికారులకు తెలియజేశాం. సరైన గదులు, వసతులు లేక ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమే. విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేస్తున్నాం.

కె. పద్మ, ప్రధానోపాధ్యాయురాలు

### డిజిటల్ తరగతులు వినలేకపోతున్నాం



పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి. శిథిలావస్థకు చేరిన భవనంలో ఇబ్బంది పడుతున్నాం. రేకుల షెడ్లలో పాఠాలు వింటున్నాం.సరైన భవనం లేని కారణంగా డిజిటల్ తరగతులు వినలేకపోతున్నాం. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న స్థలంలోనే విశాలంగా నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.

ఎన్. అక్షిత, 9వ తరగతి విద్యార్థిని




ఎంఈవో, విద్యార్థులతో రజనీకాంత్

## పర్యావరణ పరిరక్షణకు చొరవ చూపాలి

గ్రీన్ రెవల్యూషనరీ జిల్లా కో ఆర్డినేటర్ రజనీకాంత్

యాచారం. జూన్ 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు యువత చొరవ తీసుకోవాలని, నీటిని వృథా చేయకుండా ఇంకుడుగుంతల్లోకి మళ్లించాలని గ్రీన్ రెవల్యూషనరీ జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్, యాచారం ఎంఈవో పాండురంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం యంగ్ ఎర్త్‌లీడర్ కార్యక్రమంలో భాగంగా గున్‌గల్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం, హరితహారం కింద విరివిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాల గురించి ప్రజలకు వి వరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ కుమారి, జ్యోతిరాణి, జంగయ్య తదితరులున్నారు.

## రేషన్ బియ్యం 92 శాతం పంపిణీ

» జిల్లా పౌరసరఫరాల డీఎం గోపీకృష్ణ

రంగారెడ్డి అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 92 శాతం రేషన్ బియ్యం పంపిణీ చేసినట్లు పౌరసరఫరాల డీఎం గోపీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలకు సంబంధించి బియ్యం పంపిణీ చివరి దశకు చేరుకుందన్నారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోగా తీసుకోవాలని ఆయన తెలిపారు.

## రేపు చేవెళ్లకు 'తుమ్మల'

చేవెళ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఈనెల 28న చేవెళ్లలో పర్యటించనున్నారు. మండల పరిధిలోని దేవునిఎర్రవల్లిలో పామ్ ఆయిల్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి పాల్గొంటారు.


భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి 7

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్

## రూ.65లక్షలతో దుకాణ సముదాయ నిర్మాణం

● నేడు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డిలతో ప్రారంభోత్సవం


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదుట రూ.65లక్షలతో నిర్మించిన దుకాణ సముదాయం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. మార్కెట్ యార్డుకు ఆదాయాన్ని చేకూర్చేలా నిర్మించిన 8 దుకాణాలను శుక్రవారం ప్రారంభించేందుకు మార్కెట్ పాలకవర్గం, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను గురువారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ దుకాణ సముదాయ ప్రారంభోత్సవానికి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. మార్కెట్ యార్డు పరిధి ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## యాచారం ఎంపీడీవోగా రాధారాణి బాధ్యతల స్వీకరణ

యాచారం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యాచారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రాధారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె హైదరాబాద్ జీహెచ్ఎంసీ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో జి.నరేందర్ రెడ్డి సెర్ప్ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. రాధారాణి మాట్లాడుతూ.. విరివిగా మొక్కలునాటి సంరక్షణకు యువత చొరవ తీసుకోవాలన్నారు.

# అడుగడుగునా మురుగు..
# స్వచ్ఛత కనుమరుగు

హిమాయత్‌నగర్ రోడ్లపై పొంగుతున్న డ్రెయిన్లు | పరిష్కారం చూపాలంటున్న స్థానికులు

మొయినాబాద్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉప్పొంగుతున్న మురుగుతో మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి హిమాయత్‌నగర్‌లో పారిశుధ్యం లోపించింది. ఇక్కడ స్వచ్ఛత మచ్చుకైనా కన్పించని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ పారుతున్న డ్రైనేజీ నీటితో కాలనీలు, మెయిన్ రోడ్డు వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వానాకాలం.. ఈ సమయంలో మురుగు నీటిప్రవాహంతో రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చిలుకూరుకు రోడ్డులో మురుగు నిత్యం ప్రవహిస్తోంది. కల్వర్టు మూసుకుపోయి మ్యాన్ హోళ్ల నుంచి మురుగు నీరు చిమ్ముతోంది. కల్వర్టు కింది నుంచి బూరుకుంట చెరువులోకి నీరు వెళ్లే నాలా కబ్జాకు గురైంది. అధికారులు నామమాత్రంగా యూడీలో పూడిక తీస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. తమ గ్రామం కొత్తగా ఏర్పాటైన మొయినాబాద్ మునిపాలిటీలో కలవడంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు సంతోషించినా అధికారుల అలసత్వంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎండ్‌బీ అధికారులు ఇటువైపు కన్నెత్తయినా చూడడం లేదంటున్నారు.


హిమాయత్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై, కాలనీల్లో పారుతున్న మురుగు

### ఏళ్ల నుంచే సమస్య...

హిమాయత్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై ఏళ్ల నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. వైన్స్ వద్ద ఉన్న కల్వర్టును ఆక్రమించారు. కుమ్మరిబస్తీ, సాయిబాబా ఆలయం కాలనీల మురుగునీరు కల్వర్టు కింది నుంచి నాలా ద్వారా బూరుకుంట చెరువులోకి వెళ్లేది. అది కబ్జా కావడంతో మురుగు నీరు పారలేక డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. కుమ్మరిబస్తీ, సాయిబాబా, హనుమాన్ ఆలయాల వద్ద, చిలుకూరు రోడ్డులో మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయి. మున్సిపల్, ఆర్ఎండ్‌బీ శాఖల అధికారులు సంబంధం లేనట్లు వదిలేస్తున్నారు. వానపడిన సమయంలో రోడ్డంతా మురుగు నీటితో దుర్గంధభరితంగా మారుతోంది. ఏళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు పరిష్కరించడం లేదు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అయినా తగిన చర్యలుతీసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### సమస్య తీవ్రతను అధికారులు పట్టించుకోవడం లేదు



అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ఏళ్ల నుంచి హిమాయత్‌నగర్ ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి. మురుగు నీరు రోడ్డుపైకి పారిన సమయంలో తాత్కాలికంగా మ్యాన్ హోళ్లలో పూడిక తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కల్వర్టు కింద గతంలో ఉన్న నాలాను కబ్జా చేయడంతో మురుగు నీరు వెనక్కు తన్నుతోంది. యూజీడీని బూరుకుంట చెరువు వరకు నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతోంది.

- కుమ్మరి శ్రీనివాస్, హిమాయత్‌నగర్

## అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలి


దేవరయంజాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట,జూన్ 26(ఆంధ్రజ్యోతి): సొంత భవనాలు లేక ఇక్కట్లకు గురవుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు యుద్ధ ప్రాతిపాదికన భవనాలను నిర్మింపజేసి సమస్యలు తీర్చాలని అవసరమైన వసతులను బాధ్యతగా కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తూంకుంట మునిసిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె తూంకుంట ఉన్నత పాఠశాలను, దేవరయంజాల్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. దేవరయంజాల్‌లో అంగన్‌వాడీలు తాత్కాలిక భవనాల్లో నడుపుతున్నామని, పిల్లలు అవస్థలకు గురవుతున్నారని సీడీపీవో శారద అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఆమె అంగన్‌వాడీ సమస్యలపై సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమనిలతోచర్చించారు. దేవరయంజాల్‌లో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు మున్సిపల్ నిధులతో భవనాలను నిర్మింపజేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌ను ఆదేశించారు. అంగన్‌వాడీ చిన్నారులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. గర్భిణులకు గుడ్లు, పాలు నిత్యం ఇస్తున్నారా? అని అంగన్‌వాడీ టీచర్లను అడిగారు. దేవరయంజాల్‌లోని ప్రాథమిక పాఠశాలకువెళ్లి యూనిఫామ్‌లు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారా? అని విద్యార్థులను అడిగారు. అదనపు కలెక్టర్ వెంట డీఈవో విజయకుమారి, మున్సిపల్ డీఈఈ సునీత ఉన్నారు.

**అత్యున్నత శిఖరాలకు ఎదగాలి**

తూంకుంట జెడ్పీ పాఠశాలను రాధికాగుప్తా సందర్శించి పనితీరును పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధించారు. పాఠ్యాంశంలోని విషయాలను బోర్డుపై రాసి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను నిత్యం చదవి అత్యున్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు ఆమె సూచించారు.

## సైన్స్ టీచర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

యాలాల, జూన్ 26(ఆంధ్రజ్యోతి):యాలాలలోని జెడ్పీ పాఠశాల సైన్స్ టీచర్ ఖాసింబీపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని మైనార్టీ, దళితప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు టీచర్ ఇంటికి వెళ్లి మాట్లాడారు. పాఠ్యాంశంలో బోధనలో భాగంగా ప్రాక్టికల్ కింద విద్యార్థులకు గొర్రె మెదడును చూపితే సస్పెండ్ చేయటం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఆమె విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధన ప్రకారమే పాఠ్యాంశాన్ని ఖాసింబీ బోధించారని అన్నారు. అలా బోధిస్తేనే కదా విద్యార్థులకు బాగా అర్థం అయ్యేదని అన్నారు. డీఈవో సస్పెన్షన్‌ను ఎత్తివేయాలన్నారు. ఎంఈవో రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, వివిధ సంఘాల నాయకులు గుమ్మడి రత్నం, పి.శ్రీనివాస్, వాజిద్, పి.జిలాని తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న యాదగిరి

కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ప్రతీ గ్రామంలో జెండా గద్దెల నిర్మాణాలు చేపట్టాలని సంఘం రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఎం.యాదగిరి తెలిపారు. గురువారం కందుకూరులో మండల శాఖ అధ్యక్షుడు మల్లెపల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. జులై 7న నిర్వహించనున్న ఆవిర్భావ వేడుకల్లో గ్రామాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొనేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ, యువజన సంఘం మండలశాఖ అధ్యక్షుడు గానుగపేట జంగయ్య, మండల నాయకులు కె.కృష్ణమాదిగ, నాని, కె.చెన్నయ్య, కె.ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద మందులు వాడాలి


వైద్యశిబిరంలో ఆయుర్వేద వైద్యురాలు ఇందిర, గ్రామస్తులు

యాచారం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులు వాడి దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకోవచ్చని నజ్దిక్‌సింగారం ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ ఇందిర సూచించారు. గురువారం నందివనపర్తిలో ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వాతం, కీళ్లనొప్పులు, అజీర్ణం, చర్మవ్యాధులకు ఆయుర్వేద మందులు బాగా పనిచేస్తాయన్నారు. స్త్రీ సంబంధిత వ్యాధుల నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యదర్శి శ్రీనివాస్, ఎస్బీఐ అధికారి మల్లికార్జున్ ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరిట వసూళ్లు

● ఎక్మాయిలో కాంగ్రెస్ నాయకుల చేతివాటంపై విమర్శలు

బషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎక్మాయిలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట అధికార పార్టీ నాయకులు కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ పక్క ఎమ్మెల్యే ఇళ్ల విషయంలో ఎవరైనా డబ్బుల వసూళ్లుచేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తున్నా కింది స్థాయిల నాయకులకు లెక్క చేయడం లేదు. గ్రామానికి 26 ఇళ్లు మంజూరయ్యాయి. ప్రొసీడింగ్‌లు తెచ్చిన నాయకులు కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ఇంటికి రూ.3వేల నుంచి 5వేల వరకు వసూళ్లు చేశారని చెబుతున్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపికను చేపట్టారు. అయితే కమిటీ సభ్యులు, నాయకులు తమ వారికే ఇళ్లు ఇప్పించారని చర్చించుకుంటున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో కొందరు నాయకులను మందలించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని వసూళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కిష్టమ్మగుడితండా పాఠశాలలో కష్టాలు

● ఆరు బయటే వంటకాలు ● వర్షం వస్తే అంతే సంగతులు


ఆరుబయటే వంటలు చేస్తున్న నిర్వాహకులు

పరిగి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ పరిధిలోని కిష్టమ్మగుడి తండా పాఠశాలలో వసతులు కరువయ్యాయి. మధ్యాహ్న భోజనం వంట కోసం కిచెన్ లేదు. వంట చేసే ఏజెన్సీ నిర్వాహకులు ఆరుబయటే వంట చేస్తున్నారు. వర్షం కురిస్తే ఆ రోజు విద్యార్థులకు భోజనం అంతే సంగతులని తండా వాసులు చెబుతున్నారు. పాఠశాలలో 75మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపోను గదులు కూడా లేవు. ఆరుబయల భోజనం చేస్తున్నారు. అధికారులు వంటగదిని నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు.


పాఠశాల ప్రాంగణంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అంచెలంచెలుగా నెరవేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా శంషాబాద్ మండల రైతులకు పెట్టుబడి సాయం డబ్బులు జమవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. గురువారం శంషాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్, డీసీసీ నాయకురాలు మైలారం సులోచనలు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కొత్వాల్‌గూడ మిట్టు, బి.కిష్టయ్య, అక్రమ్, శ్రీధర్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ ఏడీఏగా రమాదేవి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలిగా రమాదేవి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఏడీఏగా పనిచేసిన రాజారత్నం పదోన్నతిపై వెళ్లారు. ఇన్నాళ్లు ఏఓ నిశాంత్‌కుమార్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. రమాదేవికి ఉద్యోగులు స్వాగతం పలికి సన్మానించారు.


బాధ్యతలు తీసుకున్న రమాదేవిని సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

## విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలి


కస్తూర్బా విద్యాలయంలో బాలికలతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హర్షిత్ చౌదరి

తాండూరు రూరల్, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు నాణ్యమైన భోజనంతోపాటు మంచి విద్యనందించేందుకు పాఠశాల నిర్వాహకులు చర్యలుచేపట్టాలని వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ హర్షిత్ చౌదరి ఆదేశించారు. గురువారం ఐనెల్లిలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయ పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో 400 మంది విద్యార్థినులు ఉన్నారని ప్రిన్సిపాల్ ఆశాలత తెలిపారు. గురువారం 300మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. విద్యాలయంలో సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. బాలికలకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని సూచించారు. అనంతరం సమీపంలోని గుంతబాస్పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఆయనవెంట తహసీల్దార్ తారాసింగ్,ఆర్ఐ గోపి, రెవెన్యూ సిబ్బంది, టీచర్లు ఉన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

శంషాబాద్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్ అన్నారు. గురువారం శంషాబాద్ బస్‌స్టాండ్ నుంచి ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, ఇది వారి ఆరోగ్యానికి, కుటు ంబాలకు, దేశానికి ప్రమాదకరమన్నారు. ప్రభుత్వం తెలంగాణాను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేంతు కృషిచేస్తోందని చెప్పారు. మన దేశానికి వెన్నెముక అయిన యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాకారం చేసుకునేందుకు కృషిచేయాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు కాలేజీలు, ఉన్నత పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైతూ జీవితం శూన్యం అన్నారు. యాంటీ గ్రడ్స్ వీక్‌గా ఏడు రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ రావు, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐలు నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, ఎస్సైలు శ్రీధర్, అర్షద్ అలీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

## డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టాలని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ నిర్మూలించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్-2 ప్రోగ్రాం ఆఫీసర్ చిన్ని శ్రీనివాస్, ఇంజినీరింగ్ విభాగం డీన్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నాయకులు

## ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు

బొంరాస్‌పేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి రోడ్డు నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం బాపల్లితండాలో రూ.2.24కోట్లతో వేసే డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తండా నుంచి పరిగి మండలం బడెంపల్లి వరకు రోడ్డు వేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, మల్లికార్జున్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి,వెంకట్రాములుగౌడ్, మోత్యా నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

## జాతీయ విద్యా శిక్షణకు ఈశ్వర్‌రావు



పరిగి,జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో జాతీయ స్థాయి శిక్షణకు కంకల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రావు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టి) ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి, అభ్యసన విధానాలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో ఆయన ప్రదర్శనతో జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి 20మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా, వారిలో ఈశ్వర్‌రావు ఒకరు. ఈశ్వర్‌రావును ఎంఈవో సాయిరెడ్డి, హెచ్ఎంలు పుష్ప, లక్ష్మణ్‌లు అభినందించాచారు.



పోరండ్ల గ్రామ నాయకులతో పాండురంగారెడ్డి

## కాంగ్రెస్ బలోపేతానికి గ్రామ, మండల కమిటీలు

మహేశ్వరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు త్వరలో పార్టీ కమిటీలు పూర్తి చేస్తామని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. గురువారం పోరండ్లలో పార్టీ గ్రామశాఖ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. కమిటీలను ఏర్పాటుచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మదన్ పాల్, వేణుగోపాల్, యాదయ్య, శ్రీనివాస్, బలరామ్, జ్ఞానేశ్వర్‌చారి, మహేందర్, సంజీవరెడ్డి, పాండు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామ శివారులోని ఎగ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ గురువారం ప్రకటనలో కోరారు. వెంకటేశ్వర హేచ రీస్ యాజమాన్యం కార్మికుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కంపెనీ ఎదుట పది రోజులుగా కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. యాజమాన్యం స్పందించి, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా ప్రభాకర్ తెలిపారు.

# 1.04లక్షల మొక్కలు నాటుతాం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శోభారాణి

ఆమనగల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమంలో ఈ ఏడాది మండలంలో 1.04లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు ప్రత్యేకాధికారి శోభారాణి తెలిపారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని కోరారు. ఆమనగల్లు మండల పరిషత్‌లో గురువారం వన మహోత్సవం, వ్యాధుల నివారణకు చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవో కుసుమమాధురి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. శోభారాణి మాట్లాడుతూ.. నాటేందుకు సిద్ధం చేసినమొక్కలు, స్థలాల ఎంపికపై చర్చించారు. మండలంలోని 13పంచాయతీల్లో ప్రతీ గ్రామంలో 8వేలకు తగ్గకుండా మొక్కలునాటి సంరక్షించాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉండడంతో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఇప్పటి వరకు బేస్మెంట్ లెవల్ పూర్తయిన 37ఇళ్ల లబ్ధిదారులకు మొదటి బిల్లు ఇచ్చామన్నారు. సమావేశంలో ఎంపీవో వినోద, మెడికల్ ఆఫీసర్ మంజుల, ఏవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేశంపేట మండల ప్రత్యేకాధికారి గోపీకృష్ణ

### వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కేశంపేట: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి గోపీకృష్ణ సూచించారు. కేశంపేట మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం వచ్చినందున మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలని సూచించారు. పెద్ద వర్షం పడిన వెంటనే మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, వ్యాధులు ప్రబలకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఆజంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఎంపీవో శిరీష, వైద్యాధికారి డాక్టర్ నిఖిత, ఉపాధి అధికారి అజీజ్ పాల్గొన్నారు.

# రోగాల కాలం.. జాగ్రత్తలు అవసరం

- గొర్రెల్లో మూతి రోగం నివారణకు అప్రమత్తంగా ఉండాలి
- వ్యాధిని గుర్తించిన వెంటనే చికిత్స చేయించాలంటున్న పశువైద్యులు

### జీవాల సంరక్షణపై శ్రద్ధపెట్టాలి



దుద్యాల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో జీవాలకు సీజనల్ వ్యాధులు విరివిగా వస్తుంటాయి. అందుకే ఇతర కాలాలతో పోలిస్తే వాటి సంరక్షణకు గొర్రెలు, మేకల పెంపకందారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. వర్షాలు కురిసే సమయాల్లో గొర్రెలు, మేకలకు మూతిరోగం వస్తుందని పశువైద్యులు సూచిస్తున్నారు. ఈ మూతి రోగాన్ని నీలి నాలుక వ్యాధి అని కూడా పిలుస్తారు. ఇది వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. గొర్రె భాగాల్లో, ముఖంలో వాపు, పండ్లు ఏర్పడతాయి. దోమ కాటు వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. మందలో ఒక గొర్రెకు వ్యాధి సోకితే మిగతా వాటికీ త్వరగా వ్యాపిస్తుంది. కాబట్టి వ్యాధిసోకిన గొర్రె, లేదా మేకను వెంటనే మంద నుంచి వేరుచేయాలి. వెంటనే చికిత్స చేయించాలి.

### వ్యాధి లక్షణాలు

గొర్రెలకు తీవ్ర జ్వరం, ముఖం వాపుతో పాటు, పుండ్లు ఏర్పడతాయి. పెదవులు, ముఖం చిగుళ్లు, నాలుక, ముక్కు చుట్టూ వాస్తుంది. ఆహారం తినేందుకు ఇబ్బంది పడతాయి. నోటి నుంచి దుర్వాసన వస్తుంది. వ్యాధి ముదిరితే నాలుక నీలి రంగులోకి మారుతుంది. ముక్కు నుంచి చీము, రక్త స్రావం అవుతుంది. జిగురు ఎండి ముక్కులో ఇరుక్కొని శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడి నీరసించి చివరికి చనిపోయే ప్రమాదం ఉంటుంది.

### నివారణ చర్యలు

మూతి రోగం దోమ కాటు వ్యాప్తి చెందుతుంది. వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. నీటి తొట్ల వద్ద జింక్ సల్ఫేడ్ లేదా పొటాషియం పర్మాంగనేట్ ద్రావణాన్ని ఉంచితే అంటువ్యాధిని నియంత్రించొచ్చు. జూన్ చివరి వారం, జూలై, ఆగస్టు నెలల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. పెంపకందారులు వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించి పశువైద్యులతో చికిత్స అందించాలి. గొర్ల మందను సాయంత్రం షెడ్డు/కొట్టానికి చేర్చిన తర్వాత మంద చుట్టూ వేపాకు కాల్చి పొగవేయాలి. పొగకు దోమలు అక్కడి నుంచి వెళ్లిపోతాయి. ఇక వేళ వ్యాధి సోకితే వెంటనే చికిత్స చేయించాలి.

### పశువైద్యశాలల్లో మందుల కొరత

వ్యాధి సోకిన జీవాలకు టీకాలు వేయిద్దామంటే అందుబాటులో లేవని గొర్రెల పెంపకందారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పశువైద్యులను అడిగితే ఆగస్టులో వస్తాయని చెబుతున్నారని తెలిపారు. మెడికల్ షాపుల్లో కొందామంటే భారీ ధరలు ఉన్నాయని చెబుతున్నారు. పశువైద్యాధికారులు స్పందించి వైద్యశాలల్లో టీకాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారుల స్పందన కోరగా.. టీకాల కొరత ఉందని, జూలై, ఆగస్టుల్లో వస్తాయని చెప్పారు.

# రఘువీరారెడ్డికి పదవివ్వాలి

- అనుచరుల నినాదాలు
- కాంగ్రెస్ సమావేశంలో గందరగోళం
- మీటింగ్ నుంచి వెళ్లిపోయిన పీసీసీ పరిశీలకులు



రోడ్డుపై బైఠాయించిన నాయకులు

ధారూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సముచిత పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పీసీసీ పరిశీలకుల ముందు ఆయన అనుచరులు హల్‌చల్ చేశారు. ధారూరులోని శుభం ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా, మండల, గ్రామ కమిటీల నియామకానికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పీసీసీ పరిశీలకులుగా అశోక్, రాంశెట్టి నరేందర్, వికారాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, మండల నాయకులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలోనే పి.రఘువీరారెడ్డి అనుచరులు లేచి నినాదాలు చేశారు. రఘువీరారెడ్డికి పదవి లేకుండా తమకు పదవులొద్దని, ఆయనకు పదవిస్తేనే తామూ తీసుకుంటామని నినాదాలు చేశారు. రఘువీరారెడ్డి జిందాబాద్ అని నినదించారు. 23ఏళ్లుగా పార్టీకి పనిచేస్తున్న రఘువీరారెడ్డికి తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదని అనుచరులు మండిపడ్డారు. దీంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. అనంతరం వారు ఫంక్షన్ హాల్ నుంచి బయటకొచ్చి రోడ్డుపై బైఠాయించారు. సమావేశం నిర్వహణకు పరిస్థితులు అనుకూలంగా లేవని వాయిదా వేద్దామని పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ పరిశీలకులతో అన్నారు. దీంతో పరిశీలకులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో గొడవ, ఘర్షణలు జరగలేదని, రఘువీరారెడ్డికి ప్రాధాన్యం ఇవ్వాలనే కార్యకర్తలు సమావేశాన్ని బహిష్కరించారని మాన్‌సింగ్ చెప్పారు. సమావేశాన్ని తర్వాత నిర్వహించుకుందామని తెలపటంతో పరిశీలకులు వెళ్లిపోయారని ఆయన వివరించారు.



నిల్వ పదార్థాలను పరిశీలిస్తున్న మునిసిపల్ సిబ్బంది

## హోటళ్లలో విస్తృత తనిఖీలు

తాండూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తాండూరులోని పలు హోటళ్లను మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. శానిటేషన్ విభాగ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. కుళ్లిన కూరగాయలు, ఎక్కువ కాలం నిల్వ చేసిన పదార్థాలును గుర్తించారు. హైదరాబాద్ రోడ్డులో, పాత కూరగాయల మార్కెట్, ఇందిరా చౌక్ తదితర ప్రాంతాల్లోని హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. పాడైన, నిల్వ ఉంచిన పదార్థాలను పారబోశారు. పలు లిక్విడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. నాసిరకం ఆహార పదార్థాలపై హోటళ్ల నిర్వాహకులను ప్రశ్నించారు. హోటల్ కిచెన్, పదార్థాల నిల్వ, పారిశుధ్య, డైనింగ్ నిర్వహణపై పరిశీలించారు. హోటళ్లలో పరిశుభ్ర ఆహారాన్నే విక్రయించాలని, డైనింగ్, ఆవరణను శుభ్రంగా ఉంచాలని. ఇలాంటి పొరపాట్లు మరోసారి చేస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. దాడుల్లో శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఉమేష్, జవాన్లు పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం కల్పించండి



ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కొడంగల్/దౌల్తాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని తిరుమలాపూర్, నాగసార్, తిమ్మారెడ్డిపల్లి, గుండెపల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం కొడంగల్‌లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 7వ తరగతి వరకు చదవిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం కొడంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉందని, బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు వేయాలని అధికారిని కోరారు.

### బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల కొరకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ కోరారు. గురువారం షాద్‌నగర్ అసిస్టెంట్ డిపో మేనేజర్ సుధాకర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఫూడూర్ మండలం కడుమూరుకు గతంలో నడిసిన బస్సులను బంద్ చేయడంతో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. కడుమూరుకు బస్సును నడిపిస్తే కడుమూరు, తిరుమలాపూర్, మిట్టకంకల్, తిమ్మారెడ్డిగూడెం, ఎర్రవల్లి, తాళ్లపల్లి, దోస్వాడ విద్యార్థులు షాద్‌నగర్‌కు వచ్చి చదువుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.

## ఉమ్మడి జిల్లాలో కొత్తగా 9 ఎక్సైజ్ స్టేషన్లు

- రేపు ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా 14 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ నెల 28న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వాటిని లాంఛనంగా ప్రారంభిస్తారని ఎక్సైజ్ అధికారులు గురువారం తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొత్తగా పెద్ద అంబర్‌పేట్, కూకట్‌పల్లి, కొంపల్లి, నాచారం, అల్వాల్, గండిపేట్, కొండాపూర్, మీర్‌పేట్, కాప్రాలలో ఎక్సైజ్ స్టేషన్‌లు ఏర్పాటవుతాయి.



మేడిపల్లిలో ర్యాలీలో ఫార్మాసిటీ నిర్వాసితులు

## భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

యాచారం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు మాట ఇచ్చినట్టుగా ఫార్మాసిటీ కోసం నిషేధిత జాబితాలో పెట్టిన పట్టా భూములను రైతుల పేరిట ఆన్‌లైన్ నమోదు చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నిరంజన్, కవుల సరస్వతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మేడిపల్లిలో రైతులతో సమావేశమయ్యారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పట్టాభూములను రైతుల పేరిట ఆన్‌లైన్ చేస్తామని కాంగ్రెస్ మాటిచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేయడం భావ్యం కాదన్నారు. కోర్టు ఉత్తర్వును కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. న్యాయం కోసం జూలై 7న కుర్మిద్ద నుంచి మేడిపల్లి వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే కలెక్టర్, ఆర్డీవోల కార్యాలయాలను ముట్టడిస్తామని వెల్లడించారు.

## విద్యార్థులు బాగా చదువుకోవాలి



తరగతి గదులను ప్రారంభిస్తున్న రౌండ్‌టేబుల్ సభ్యులు

శంకర్‌పల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శంకర్‌పల్లి ఎంఈవో అక్బర్ అన్నారు. శంకర్‌పల్లి బాలికల పాఠశాలలో గురువారం రౌండ్ టేబుల్-134 వారు నిర్మించిన ఆరు క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. రౌండ్ టేబుల్-134 వారు శంకర్‌పల్లి బాలికల పాఠశాలలో ఆరు తరగతి గదులు, కస్తూర్బా విద్యాలయంలో ఆరు తరగతి గదులు నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం ఉంటే మరింత వృద్ధి సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వేదశ్రీ, మహాలింగాపురం, నరహరి, జీవనజ్యోతి, రౌండ్ టేబుల్ 134 సభ్యులు పాల్గొన్నారు.

## నంద్యాతండా వాసి రాజునాయక్‌కు డాక్టరేట్



పరిశోధన గ్రంథాన్ని చూపుతున్న రాజునాయక్

చౌదరిగూడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం నంద్యాతండాకు చెందిన రాజునాయక్ పిహెచ్‌డీ పట్టా పొందారు. ప్రొఫెసర్ బ్రహ్మానందం చేతుల మీదుగా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో 2018లో పొలిటికల్ సైన్స్ విభాగంలో సీటు సాధించాడు. 'ట్రైబల్ డెవలప్మెంట్- ఎ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్' అనే అంశంపై రీసెర్చ్ చేసి ఉత్తీర్ణత పొందాడు. గురువారం ప్రొఫెసర్ బ్రహ్మానందం నుంచి రాజు పీహెచ్‌డీ అందుకున్నారు. రాజు నాయక్‌ను గిరిజన నాయకులు, అధ్యాపకులు అభినందించారు.


ఆమనగల్లు : ర్యాలీలో సీడీపీవో శాంతిరేఖ


చౌదరిగూడ : కొందుర్గులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై రవీందర్ నాయక్


కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్‌పై మానవహారంలో ఎస్సై సైదులు, తదితరులు


కడ్తాల్ : ర్యాలీలో సీజీఆర్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి అధికారులు, తదితరులు



ఇబ్రహీంపట్నం : డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, తదితరులు

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అధికారులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక, పర్యావరణవేత్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మత్తు, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలందరూ పాలుపంచుకోవాలని వారు తెలిపారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల వినియోగం ప్రజలకు కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


యాచారం : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న గున్‌గల్ మోడల్ స్కూల్ విద్యార్థులు


మాడ్గుల : ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, టీచర్లు


చేవెళ్ల : అవగాహన ర్యాలీలో జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు


కొత్తూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యాశాఖ అధికారులు


షాద్‌నగర్ అర్బన్ : మాదక ద్రవ్యాలు ముట్టబోమని ప్రతిజ్ఞ చేస్తున్న డిగ్రీ, జూనియర్ కాలేజీ విద్యార్థులు


షాబాద్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి


తలకొండపల్లి : వెల్జాల్‌లో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్



షాద్‌నగర్ రూరల్ : లింగారెడ్డిగూడలో గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్


మహేశ్వరం : తుక్కుగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు



శంకర్‌పల్లి : ర్యాలీలో మోకిల సీఐ వీరబాబు


కేశంపేట : కొత్తపేటలో నిర్వహించిన ర్యాలీలో సీఐ నరహరి, ఎస్సై రాజ్‌కుమార్

## క్రైం కార్నర్

### డీసీఎంను ఢీకొన్న కారు.. వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నిలిపి ఉన్న డీసీఎంను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కథనం మేరకు.. జడ్చర్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం కేశంపేట బైపాస్ చౌరస్తా సమీపంలో నిలిపి.. డ్రైవర్ మహ్మద్ జావేద్ అలీ వెనుకకు వచ్చి అందులో ఉన్న వస్తువు తీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అదే సమయంలో జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి మొదట ఆటోను ఢీకొని.. తర్వాత డీసీఎంను ఢీకొంది. దాంతో డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోడ్రైవర్ నర్సింలు(55) కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

### కుక్కల దాడిలో మేకలు మృత్యువాత

యాచారం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ద గ్రామంలో గురువారం పొలంలో మేత మేస్తున్న ఐదు మేకలపై వీధికుక్కలు దాడి చేసి పీక్కు తిన్నాయి. గ్రామానికి చెందిన అనేమోని రవీందర్ మేకలను మేతకు వదిలి పొలం పనుల్లో నిమగ్నమయ్యాడు. ఈక్రమంలో వీధికుక్కలు మేకలపై దాడి చేశాయి. కాగా, ఐదు మేకలు మృతిచెందగా.. వాటి విలువ సుమారు రూ.35వేల వరకు ఉంటుందని బాధితుడు రవీందర్ తెలిపాడు.

### వివాహిత అదృశ్యం


స్వాతి (ఫైల్)

షాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి కథనం మేరకు.. షాబాద్ మండల కేంద్రానికి చెందిన సొనాయిల స్వాతి గత నెల 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9989792750 నెంబర్‌కు గానీ, డయల్ 100కు గానీ ఫోన్ చేసి సమాచారం అందజేయాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆమె భర్త నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఐదు మట్టి టిప్పర్లు సీజ్

ఇబ్రహీంపట్నం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అధిక లోడ్‌తో నల్లమట్టిని తరలిస్తున్న ఐదు టిప్పర్లను ఆర్టీఏ అధికారులు సీజ్ చేసి ఘటన గురువారం ఇబ్రహీంపట్నం పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, ఆర్టీఏ అధికారి సుశీల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం మాల్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు నల్లమట్టిని తరలిస్తున్న టిప్పర్లు అధిక లోడుతో వెళుతున్నట్లు స్థానికులు గమనించారు. వాహనదారులకు, ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని ఫిర్యాదు చేయడంతో ఐదు టిప్పర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని ఆర్టీఏ అధికారులు తెలిపారు. నిబంధనలు పాటించకుండా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


చేవెళ్ల : విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న భీంభరత్, శ్రీకాంత్‌రెడ్డి

చేవెళ్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం తంగడపల్లిలో దాత శ్రీకాంత్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో పురందాస్, హెచ్ఎం వెంకటయ్య, టీచర్లు, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు

**షాబాద్** : ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలో ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ప్రైవేట్ స్కూల్‌కు వెళుతున్న 28 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. గ్రామస్థులు రవీందర్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, యాదయ్య, బలరాం, శ్రీనివాసాచారి, శ్రీనివాస్, మురళి, మహమూద్, రవి, సతీష్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఆదిబట్ల : సంఘ సేవకుడు బజారు భిక్షపతి కుమార్తె దీక్షిత ఇటీవల అకాల మరణం చెందింది. ఆమె జ్ఞాపకార్థం ఎలిమినేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భిక్షపతి గురువారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తన ఇద్దరు పిల్లల్ని సర్కార్ బడుల్లో చేర్పించినట్లు తెలిపారు. భిక్షపతిని ఉపాధ్యాయులు సన్మానించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, నరసింహ, రాజేందర్, టీచర్లు సుధాకర్, రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లీ కష్టాలు?

(ఐదో పేజీ తరువాయి)

గురించి ఎవరూ చొరవ చూపడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా తీర్చి దిద్దుతున్నట్లు పాలక ప్రభుత్వం పేర్కొంటున్నప్పటికీ ఇక్కడ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.

### 78 మంది విద్యార్థులతో..

ఆమనగల్లు పట్టణంలోని బస్టాండ్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ఐదు తరగతుల్లో ప్రస్తుతం 78 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నా వసతుల లేమితో తమ పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా 2020 నుంచి క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. పాఠశాలలో 9మంది ఉపాధ్యాయులుండగా, ఒకరు వీఆర్ఎస్ తీసుకోవడంతో జీవశాస్త్రం పోస్టు ఖాళీగా ఉంది. స్వీపర్ పోస్టు భర్తీ చేయకపోవడంతో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ కూడ ఇబ్బందిగా మారింది. పాఠశాలకు భద్రత కొరవడి గతేడాది ఫ్యాన్లు అపహరణకు గురయ్యాయి. సరైన భవనం లేని కారణంగా డిజిటల్ తరగతులు నిర్వహించలేకపోతున్నారు. అదేవిధంగా కోతుల బెడదతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు.

### రేకుల షెడ్లలో తరగతుల నిర్వహణ

ఆమనగల్లు పట్టణానికి ఐదు దశాబ్దాల క్రితం యూపీఎస్ పాఠశాల మంజూరైంది. సొంత భవనం లేని పాఠశాలను అప్పట్లో ఓ అద్దె భవనంలో ప్రారంభించారు. ఆ తర్వాత మూడు దశాబ్దాల క్రితం బస్టాండ్ సమీపంలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి భవనంలోకి పాఠశాలను మార్చారు. 13 ఏళ్ల క్రితం యూపీఎస్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. 11ఏళ్ల క్రితం సొంత భవన నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిర్దిష్ట స్థలం లేక నిధులు వెనక్కి మళ్లాయి. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న శిథిలావస్థకు చేరిన భవనం, స్థలం మండల పరిషత్ ఆధీనంలో ఉన్నాయి. దాన్ని పాఠశాలకు కేటాయించాలని స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నా ఆ దిశగా ఎవరూ ప్రయత్నం చేయడం లేదు. అదే స్థలంలో పాఠశాల నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. పాఠశాల నిర్వహించే పాత ఆసుపత్రి భవనం పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో దాతల సహకారంతో ఉపాధ్యాయులు ఆరు రేకుల షెడ్లు నిర్మించారు. ఐదు షెడ్లలో తరగతులు, ఒక షెడ్ స్టాఫ్‌కు వినియోగిస్తున్నారు.

### నిరుపయోగంగా మరుగుదొడ్లు

పాఠశాలలో మరుగు దొడ్లు, మూత్రశాలలు నిర్వహణ లేక కళాహీనంగా, నిరుపయోగంగా మారాయి. తలుపులు ధ్వంసమయ్యాయి. దీంతో మల, మూత్ర విసర్జనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

## సాయిచంద్ సేవలు మరువలేనివి


కడ్తాల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరమేశ్

కడ్తాల్/ఆమనగల్లు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో గాయకుడు సాయిచంద్ అందించిన సేవలు మరువలేనివని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. తన ఆటపాటలతో తెలంగాణ ఉద్యమంతో పాటు తెలంగాణ పునర్‌నిర్మాణంలో సాయిచంద్ క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో గురువారం ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ దివంగత సాయిచంద్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. కంబాల పరమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 29న నారాయణపేట్ జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని అమరచింతలో సాయిచంద్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆర్ఎస్ఎస్ఎం కో ఆర్డినేటర్ వీరయ్య, నాయకులు లచ్చిరాంనాయక్, చంద్రమౌళి, లాయర్ అలీ, కడారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయిచంద్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆమనగల్లు పట్టణంలో స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కడ్తాల్ మండలాధ్యక్షుడు పరమేశ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మాజీ సర్పంచ్ సోనా శ్రీనునాయక్, ఉప్పుల రాములుయాదవ్, ఖలీల్, బాలస్వామి, యూత్ వింగ్ అధ్యక్షుడు వడ్డె వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

## అంతా మా ఇష్టం!

(ఐదో పేజీ తరువాయి)

సరైన వైద్యం అందటం లేదు. ఇటీవలే కలెక్టర్ సి. నారాయణరెడ్డి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పశువైద్యులు అందుబాటులో ఉండాలని, జిల్లా అధికారి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి విధుల్లో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌జేడీ బాబు బేరి తనిఖీలు చేపట్టారు. పనిచేయని ఉద్యోగుల భరతం పట్టారు. హైదర్‌గూడ పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేయగా, అక్కడ గాలికుంటు నివారణ టీకాలు పశువులకు వేయకుండానే వేసినట్లు తప్పుడు లెక్కలు రాసినట్లు జిల్లా పశువైద్యాధికారి గుర్తించారు. దీంతో ఆయన 50 టీకా బాటిల్స్‌ను సీజ్ చేశారు. జబ్బవాపు నివారణ టీకాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రిజిస్టర్‌లో రాశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అక్కడ ఉన్న డాక్టర్ గొడవ దిగాడని, చేతిలో నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పగలగొట్టాడని ఆర్‌జేడీ ఆరోపించారు. ఆమనగల్లు డాక్టర్ మూడు రోజులు విధులకు హాజరు కాలేదని, మాడ్గుల వైద్యశాలను తనిఖీ చేయగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. కొందుర్గు డాక్టర్ ఉద్యోగానికి రావడం లేదని తెలిపారు. పనిచేయని పశువైద్య సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లాలోని పశువైద్య సిబ్బంది మూకుమ్మడిగా... ఈ జిల్లా అధికారి మాకొద్దు... మేం పనిచేయలేం.. అతనిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వెటర్నరీ డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించి ధర్నా చేపట్టారు. మరుసటి రోజే జిల్లా పశువైద్యాధికారిపై బదిలీ వేటు విధించారు. నీతి, నిజాయితీ పనిచేసిన తీరుకు బదిలీ వేటు విధించడం జరిగిందని వాపోయారు.

### ఖాళీగా 107 పోస్టులు

జిల్లాలో నాలుగు (తాలుక స్థాయి) ప్రాంత పశు వైద్య శాలలు, 46 పశువైద్య కేంద్రాలు, 87 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 309 మంది పశువైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా 202మంది ఉన్నారు. 107ఖాళీలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా అటెండర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో అటెండర్లు రిటైర్డు అవుతున్నారు. కానీ.. రిక్రూట్‌మెంట్ చేయడం లేదు. ఉన్న అటెండర్లు కూడా పదోన్నతి కోసం డిపార్టుమెంట్ ఎగ్జామ్ రాసి పారా సిబ్బంది పోస్టుకు కన్వర్టు అవుతున్నారు. ప్రతీ పశువైద్యశాలలో అటెండర్ పోస్టు ఖాళీగా దర్శనమిస్తుంది. సకాలంలో పశువైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలోని అధిక శాతం పశువైద్య కేంద్రాల్లో డాక్టర్లు ఉంటే.. సిబ్బంది లేరు. సిబ్బంది ఉంటే.. డాక్టర్లు లేరు. ఈ రెండు ఉన్న చోట అవసరమైన మందుల లేవు. పశువులకు వైద్యం అందక రోదిస్తున్నాయి.

**పశువైద్య సిబ్బంది వివరాలు**

| సిబ్బంది | మొత్తం | పనిచేస్తున్నవారు | ఖాళీలు |
|---|---|---|---|
| జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ అధికారి | 01 | 01 | 0 |
| సహాయ సంచాలకులు | 06 | 06 | 0 |
| పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు | 48 | 45 | 03 |
| వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ | 16 | 14 | 02 |
| జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ | 31 | 31 | 0 |
| లైవ్‌స్టాక్ అసిస్టెంట్ | 53 | 16 | 37 |
| వెటర్నరీ అసిస్టెంట్ | 37 | 34 | 03 |
| ఆఫీస్ సబార్డినేటర్స్ | 117 | 55 | 62 |
| మొత్తం | 309 | 202 | 107 |

### ఏళ్ల తరబడి ఒకేచోట..

జిల్లాలో పశువైద్యశాఖలో పనిచేస్తున్న పశువైద్య సిబ్బంది తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి ఒకే చోట ఉద్యోగం చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సుమారు 15 ఏళ్ల నుంచి ఒకే చోట పనిచేస్తున్నారు. మూడేళ్ల తర్వాత బదిలీ కావాల్సిన వైద్య సిబ్బంది ఒకే చోట పాతుకుపోయారు. దీంతో వారు విధులకు సరిగ్గా హాజరు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తోన్నాయి. పశుసంవర్ధకశాఖలో ప్రక్షాళన చేయాలల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

### ప్రైవేట్‌గా ఆస్పత్రుల నిర్వహణ

జిల్లాలోని కొందరు ప్రభుత్వ పశువైద్యాధికారులు ప్రైవేట్ ఆస్పత్రులు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ ఉద్యోగానికి అన్యాయం చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వ పశువైద్య ఉద్యోగాలు చేసుకుంటూ మరో వైపు ప్రైవేట్ ప్రాక్టీసు చేస్తున్నారు. పశువైద్య కేంద్రానికి వెళ్లి పశువులకు వైద్యం చేయాల్సిన సమయంలో ప్రైవేట్ ఆస్పత్రులు నడుపుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులను సరిగ్గా నిర్వహించడం లేదంటున్నారు. జిల్లాలోని కొందుర్గు, కనకమామిడి తదితర ప్రభుత్వ పశువైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులను కొనసాగిస్తూ విధులకు సరిగ్గా రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం


వెంకటేశంను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశంను గురువారం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీకి మెరుగైన సేవలు అందించి, మంచిపేరు తేవాలని కోరారు. చేవెళ్ల పట్టణాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ బేగరి రాములు, నాయకులు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, జగన్‌గౌడ్‌లు ఉన్నారు.

### రైతు సంబరాలకు సమాచారముంది

శంకర్‌పల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మోకిలలో జరిగిన రైతు సంబరాలకు తనకు సమాచారం ఉందని మోకిల సొసైటీ చైర్మన్ గోపాల్ తెలిపారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ జూన్ 24న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. రైతు సంబరాల కోసం తనకు ఎంపీడీవో వెంకయ్యగౌడ్, ఏవో చైతన్య, ఏఈవో రామకృష్ణారెడ్డిలు సమాచారం ఇచ్చారని, రైతుల పక్షాన నిరసన వ్యక్తం చేశానని గోపాల్ స్పష్టం చేశారు. సమాచారం లేదనడం అవాస్తవమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక పర్మిట్లు : ఎంపీడీవో

ఆమనగల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుక పర్మిట్‌లు ఇస్తుందని ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. ఒక ఇంటి నిర్మాణానికి 8 ట్రాక్టర్ల ఇసుక రవాణాకు పర్మిట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మండలం మంగళపల్లిలో గురువారం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి వాగును పరిశీలించారు. పర్మిట్‌లు ఉన్న వారే ఇసుక రవాణా చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు స్థానిక పంచాయతీ కార్యదర్శులను కలిసి పర్మిట్‌లను పొందవచ్చునని తెలిపారు. పర్మిట్‌ల పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. మంగళపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎంపీడీవో పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతం చేయాలన్నారు. మాజీ సర్పంచ్ జంగయ్య తదితరులు ఉన్నారు.

### ఘనంగా రాములు జన్మదిన వేడుకలు


నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న రాములు

ఆమనగల్లు, జూన్ 26(ఆంధ్ర జ్యోతి): ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, యాదవ సంఘం నాయకుడు ఉప్పుల రాములుయాదవ్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాములు కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. రాములును నేతలు సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కడ్తాల్ మండలాధ్యక్షుడు పరమేశ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మాజీ సర్పంచ్ సోనా శ్రీనునాయక్, నాయకులు సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, వడ్డె వెంకటేశ్, రమేశ్‌నాయక్, లండం యాదయ్య, వడ్డెమోని శివకుమార్, కొమ్ము ప్రసాద్, మహేశ్ నేత, వరికుప్పల గణేశ్, నాగిళ్ల జగన్, గణేశ్‌నాయక్, జంతుక శివ, జటావత్ పంతునాయక్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### క్షయ పట్ల అవగాహన కలిగి ఉండాలి

షాద్‌నగర్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): క్షయ పట్ల అవగాహన కలిగి ఉండాలని చించోడు పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో గురువారం క్షయ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. క్షయ అనేది మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్యులోసిస్ అనే సూక్ష్మ క్రిమి వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి సోకినవారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్ల ద్వారా గాలిలో వ్యాప్తి చెంది ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. డాక్టర్ ప్రవీణ, డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య మిత్రులు

ఆమనగల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబానికి బాల్యమిత్రులు చేయూతనందించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన నారమోని మల్లేశ్ యాదవ్ ఈనెల 5న వెల్దండ మండలం చెరుకూరు గేటు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. గురువారం ఆమనగల్లు పట్టణంలో మృతుడి కుటుంబ సభ్యులను బాల్యమిత్రులు పరామర్శించారు. ఈమేరకు తలా కొంత డబ్బు పోగు చేసి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య గీతకు అందించారు. ఎర్రవోలు శ్రీను, సురేశ్‌గౌడ్, కృష్ణయాదవ్, నరేందర్‌గౌడ్, చెన్నకేశవులు, వెంకటేశ్, అజీమ్, నాగేందర్, నవీన్, శ్రీశైలం, వెంకటేశ్, మణిపాల్, నాయక్, అజర్, ప్రకాశ్, శ్యామ్‌సుందర్, శ్రీనాథ్, అల్లాజీ బాల్‌రాజ్, దశరథం, రంజిత్, శేఖర్, కృష్ణ, వెంకటేశ్ ఉన్నారు.

### సంక్షిప్తంగా..

**ఆదిభట్ల** : ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కప్పాపహాడ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు జంగిలి ప్రభుదాస్ అన్నారు. గురువారం నాయకులు గ్రామంలో పర్యటించారు. తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ సరిగా లేదన్నారు. 1,10వ వార్డుల్లో గేట్‌వాల్వ్ పగిలిపోవడంతో, స్కూల్ ఆవరణంలో వాటర్‌ట్యాంక్ నీరు వృథా పోతుందని, కార్యదర్శి, అధికారులు సమస్యలు పరిష్కారించాలని కోరారు. విగ్నేష, భిక్షపతి, తదితరులున్నారు.

**యాచారం** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదప్రజలకందేలా చూడాలని ఎంపీడీవో రాధారాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు. కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో కనీసం పది వేల మొక్కలు నాటి కాపాడుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**మాడ్గుల** : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో అరుణ కుమారి హెచ్చరించారు. మండలంలోని ఇర్విన్, మాడ్గుల గ్రామాల్లో అధీకృత విత్తన షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు.

**కేశంపేట** : లేమామిడి జీపీ తుర్కలపల్లికి చెందిన దిద్దెల ప్రశాంత్ బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. రూ.5వేల నగదును కాంగ్రెస్ నాయకుడు ప్రకాశ్ ద్వారా అందించారు.

### ప్రభుత్వ విద్యా పరిరక్షణ ధర్నాకు తరలిరండి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్య పరిరక్షణనే లక్ష్యంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద విద్యా పరిరక్షణ సమితి నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలిరావాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి. చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. విద్యా పరిరక్షణకై చేస్తున్న డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని గురువారం ఫరూఖ్‌నగర్ ఎంఈఓ ఆఫీసు ఎదుట ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనివ్వాలని, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపకుల, విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ధర్నాలో అధికసంఖ్యలో టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్. రవీంద్రనాథ్, అర్జునప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని విడుదల చేస్తున్న విద్యా పరిరక్షణ సమితి సభ్యులు